# హజ్ గైడు – 3. ఉమ్రా

﴿ دليل الحاج .3 : مناسك الحج والعمرة ﴾

[ తెలుగు – Telugu – تلغو ]

dalil-alhaj.com

**అనువాదం :** ముహమ్మద్ కరీముల్లాహ్

**పునర్విమర్శ :** షేఖ్ నజీర్ అహ్మద్


islamhouse.com

2009 - 1430

# ﴿ دليل الحاج .3 : مناسك الحج والعمرة ﴾

« باللغة التلغو »

dalil-alhaj.com

ترجمة: محمد كريم الله

مراجعة: شيخ نزير أحمد

islamhouse.com

2009 - 1430

# హజ్ గైడు – 3d. ఆచరణలు- ఉమ్రా

**అల్లాహ్ యొక్క పవిత్ర కాబాగృహం వైపు దారిచూపే**

**హజ్ యాత్రికుని మార్గదర్శకత్వపు గైడు**

**హజ్ మరియు ఉమ్రా యొక్క ఆచరణలు:**

| ఉమ్రా చేసే యాత్రికుడు పాటించవలసిన ఆచరణలు |
|---|

మీఖాత్ వద్ద ఉమ్రా కొరకు సంకల్పం చేసుకుని, తల్బియహ్ పలుకుతూ
ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించటం

⇩

| ఉమ్రా యొక్క తవాఫ్ చేయటం |
|---|

⇩

| తవాఫ్ (మఖామె ఇబ్రాహీం) యొక్క రెండు రకాతులు పూర్తి చేయటం |
|---|

⇩

| అల్ ముల్తజమ్ – జమ్ జమ్ |
|---|

⇩

| ఉమ్రా యొక్క సయీ పూర్తి చేయటం |
|---|

⇩

| తలవెంట్రుకలు పూర్తిగా గొరిగించుకోవటం లేదా చిన్నవిగా కత్తిరించుకోవటం |
|---|

| Note: ఒకవేళ ఉమ్రా చేసినవారు మక్కాలోనే ఉండిపోయి, మరొక ఉమ్రా చేయాలని నిర్ణయించుకుంటే, వారు అల్ తనీమ్ మస్జిద్ (మస్జిదె ఆయెషా) వద్ద ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించి, తవాఫ్ మరియు సయీ చేయుట కొరకు మక్కా మరలి రావలెను. |
|---|

## ఉమ్రా చేసే యాత్రికుడు పాటించవలసిన ఆచరణలు

ఉమ్రా అనేది చిన్న హజ్ వంటిది. దీని పేరు అల్ ఇత్తిమార్ అనే పదం నుండి ఉద్భవించినది. “దర్శించుట” అని దీని అర్థం. అల్ ముత్తమర్ అంటే ఉమ్రా చేసే వ్యక్తి మీఖాత్ ప్రాంతం వద్ద ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించి, ఉమ్రా యొక్క తవాఫ్ చేసి, ఆ తరువాత సయీ చేసి, తల వెంట్రుకలు పూర్తిగా క్షౌరము చేసుకోవటం లేదా చిన్నవిగా కత్తిరించుకోవటం ద్వారా ఇహ్రాం స్థితిని వదిలి పెడతాడు.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన హదీథును అబూ హురైరహ్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: “ఒక ఉమ్రా, దాని తరువాతి ఉమ్రా కొరకు వాటి మధ్య జరిగిన పాపాల ప్రాయశ్చితం, పాప పరిహారం వంటిది మరియు స్వీకరించబడిన హజ్ కు ప్రతిఫలంగా స్వర్గం ప్రసాదించబడుతుంది.”.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన హదీథును జాబెర్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: “హజ్ యాత్రికులు మరియు ఉమ్రా చేసేవారు అల్లాహ్ యొక్క అతిథులు. వారు ఆయనను వేడుకున్నప్పుడు, వారు కోరిన వరాలు ఆయన వారికి ప్రసాదిస్తాడు, వారు ఆయనను క్షమాపణ కోరినప్పుడు, ఆయన వారిని క్షమించివేస్తాడు”

> ఒకవేళ ఉమ్రా చేసినవారు మక్కాలోనే ఉంటూ, మరొక ఉమ్రా చేయాలని నిర్ణయించుకుంటే, వారు అల్ తనీమ్ మస్జిద్ (మస్జిదె ఆయెషా) వద్ద ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించి, తవాఫ్ మరియు సయీ చేయుట కొరకు మక్కా మరలి రావలెను.

### ఇహ్రాం :

ఇహ్రాంలో సంకల్పం మరియు తల్బియాలు ఉన్నాయి. హజ్ / ఉమ్రాల యాత్రికుడు మీఖాత్ ప్రాంతం వద్ద లేదా దానికి కొంచెం ముందుగానే తన మనశ్శాంతి కొరకు ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశిస్తాడు. ఇహ్రాం స్థితిలో ప్రవేశించటానికి ముందు ఈ క్రింది వాటిని చేయవలసినదిగా యాత్రికునికి ఒక సలహా:

- తన గోళ్ళు కత్తిరించుకోవటం, మర్మాంగాల మరియు చంకల్లోని వెంట్రుకలు తొలగించుకోవటం.

- గుసుల్ చేయటం మరియు వుదూ చేయటం.
- కుట్టబడని, రెండు తెల్లటి దుప్పట్లతో తన శరీరాన్ని చుట్టుకోవటం. క్రొత్తవైతే మంచిది.
- శరీరానికి ఇత్తరు పూసుకోవటం.

ఆ తరువాత అతను మనస్పూర్తిగా ఉమ్రా చేసే సంకల్పాన్ని చేసుకోవలెను మరియు తన సంకల్పాన్ని ఇలా ఉచ్ఛరించవచ్చు:

"ఓ అల్లాహ్! నేను ఉమ్రా చేయటం కొరకు నిశ్చయించుకున్నాను. కాబట్టి దానిని నాకు సులభతరం చేయి మరియు వాటిని నా నుండి స్వీకరించు. నేను ఉమ్రా చేసే ఉద్దేశ్యంతో అల్లాహ్ కొరకు ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించాను, కాబట్టి మార్గంలో ఇహ్రాం విడిచి పెట్టవలసినంత తీవ్రమైన ఆటంకం ఏర్పడితే, అక్కడే నేను ఇహ్రాం విడిచిపెడతాను. "

ఆ తరువాత యాత్రికుడు ఇలా తల్బియా పలకవలెను: **"లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లా షరీక లక లబ్బైక్. ఇన్నల్ హమ్ద వన్నేమత లకవల్ ముల్క్. లా షరీక లక్"** (హాజరయ్యాను ఓ అల్లాహ్! నేను హాజరయ్యాను! నీకు భాగస్వాములెవరూ లేరు. నీ వద్ద హాజరయ్యాను. నిశ్చయంగా సకల ప్రశంసలు నీకే, సకల అనుగ్రహాలు నీవే, విశ్వమంతా నీదే. నీకు భాగస్వాములెవరూ లేరు).

మూడు సార్లు తల్బియా పలుకి, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై దరూద్ పంపుతూ దీనిని ముగించ వలెను.

ఏదైనా కొండ పైకి ఎక్కుతున్నప్పుడు, ఏదైనా లోయలోనికి దిగుతున్నప్పుడు, తన వాహనంలోనికి ప్రవేశిస్తున్నప్పుడు, వాహనం నుండి బయటకు వస్తున్నప్పుడు యాత్రికుడు తల్బియా చదువుతూ ఉండవలెను. అలాగే తన స్నేహితులను, పరిచయస్తులను కలుస్తున్నప్పుడు మరియు నమాజు ముగించిన తరువాత తల్బియా చదువుతూ ఉండవలెను.

**మీఖాత్ స్థలాలు: ఈ ప్రాంతాలలో తప్పని సరిగా ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించవలెను.**

మక్కా వెళ్ళుతున్న హజ్ / ఉమ్రా యాత్రికుడు ఇహ్రాంలోనికి ప్రవేశించకుండా ఈ నిర్ధేశిత ప్రాంతాలను దాటకూడదు. వేర్వేరు దిశలలో మక్కా వచ్చే ప్రజలు ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించటం కొరకు వేర్వేరు మీకాత్ స్థానాలు ఉన్నాయి:


- మదీనా వైపు నుండి వచ్చే ప్రజల మీఖాత్: దుల్ హులైఫా, దీని మరో పేరు అబ్యార్ అలీ.
- షామ్ (సిరియా, లెబనాన్, జోర్డాన్..) వైపు నుండి వచ్చే ప్రజల మీఖాత్: అల్ జుహ్ఫా (రాబిగ్).

➢ ఇరాఖ్ వైపు నుండి వచ్చే ప్రజల మీఖాత్: ధాత్ ఇర్ఖ్.

➢ యెమన్ వైపు నుండి వచ్చే ప్రజల మీఖాత్: యలంలం.

➢ మక్కాలో ఉన్న ప్రజలు ఒకవేళ ఉమ్రా చేయదలుచుకుంటే, ల్ తనీమ్ (మస్జిదె ఆయేషా) వద్దకు వెళ్ళి, ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించవలసి ఉన్నది.

---




మక్కా నుండి దూరం (కి.మీ.)

| | |
|---|---|
| దుల్ హులైఫ (అబ్యార్ అలీ) | 437 |
| అల్ జుహ్ఫ (రాబిగ్) | 204 |
| ఖరన్ అల్ మనజిల్ | 94 |
| యలంలం | 94 |
| ధాత్ ఇర్క్ | 98 |
| జిద్దా | 73 |
| అల్ తాయిఫ్ | 88 |
| అల్ జురానా | 16 |
| అత్తనీమ్ | 6 |
| అల్ హుదైబియ్య | 15 |
| అల్ ముఖత్త పర్వత మార్గం | 14 |
| అద్దాత్ లబన్ | 12 |
| అరఫహ్ దిశ నుండి | 24 |

ఇహ్రాం కొరకు నిర్ణయించబడిన మీఖాత్ ప్రాంతాలు

## ఇహ్రాం స్థితిలో నిషేధించబడిన పనులు :

1. అల్ రఫహ్: ఇహ్రాం స్థితిలో ఉన్న భార్యాభర్తలు దాంపత్యసుఖం (సంభోగం, ప్రేమకలాపాలు, కామంతో స్పర్శించటం, కౌగలించుకోవటం, ముద్దు పెట్టుకోవటం మొదలైనవి)
2. అవిధేయత: అవిధేయత చూపటం నిషేధించబడినది.
3. ఇతరులను అవమానించటం మరియు పోరాడటం వైపు దారి తీసే కోపతాపాలకు అసలు కారణమైన వాదులాడటం, కొట్లాడటం వంటివి నిషేధింపబడినవి.
4. పురుషులు కుట్టబడిన దుస్తులు ధరించటం నిషేధించబడినది.
5. వెంట్రుకలు కత్తిరించటం నిషేధించబడినది.
6. ఇత్తరు వంటి సుగంధద్రవ్యాలు (సబ్బులు, షాంపూలు) వాడటం నిషేధించబడినది.
7. గోళ్ళు కత్తిరించటం నిషేధించబడినది.
8. పురుషులు తమ తలను దేనితోనైనా కప్పటం నిషేధించబడినది.
9. వేటాడటం నిషేధించబడినది.
10. చెట్లు నరకటం నిషేధించబడినది.
11. మేజోళ్ళు మరియు ఫుల్ బూట్లు తొడగటం నిషేధించబడినది. కానీ, చీలమండలం పైకి రాని బూట్లు తొడుక్కోవచ్చు.
12. నిద్రపోతున్నప్పుడు ముఖం కప్పకోవటం నిషేధించబడినది.



## ఇహ్రాం స్థితిలో అనుమతించబడిన పనులు :

1. తహారా అంటే పరిశుద్ధమయ్యే, మురికి తొలగించుకునే, అలసట పోగొట్టుకునే ఉద్దేశ్యంతో సబ్బులు, షాంపూలు వాడకుండా, స్నానం (గుసుల్) చేయటం అనుమతించబడినది.
2. నొప్పితో ఉన్న పంటిని తొలగించటం, విరిగిన ఎముకలు సరిచేయటం అనుమతించబడినది.
3. ఏ వెంట్రుకలూ రాలకుండా, తలపై లేదా శరీరంపై నెమ్మదిగా రుద్దటం అనుమతించ బడినది. ఏ ఒక్క వెంట్రుక రాలినా, దానికి ప్రాయశ్చితం చేయవలసి ఉంటుంది.
4. చెప్పులు, ఉంగరం, కళ్ళద్దాలు, ఇయర్ ఫోన్లు, గడియారం, బెల్టు etc ధరించవచ్చు. అవసరమైన పేపర్లు మరియు డబ్బులు పెట్టుకోవటానికి బట్వా, పర్సు వంటివి దగ్గర పెట్టుకోవచ్చు.
5. యాత్రికుడు మురికి తొలగించటానికి అవసరమైతే తన ఇహ్రాం దుస్తులను కడుక్కోవచ్చు లేదా మార్చుకోవచ్చు.



**మక్కాలో ప్రవేశించటం:**



మక్కాలో ప్రవేశించేటప్పుడు యాత్రికుడు ఇలా వేడుకోవలెను:

“ఓ అల్లాహ్ ! ఇది నీ యొక్క పవిత్ర స్థలం మరియు నీ ప్రత్యేక సంరక్షణలోని స్థలం. కాబట్టి, నరకాగ్ని నా శరీరాన్ని తాకకుండా నిషేధించు మరియు నీ శిక్షనుండి నన్ను కాపాడు. నీ దాసులను తిరిగి జీవింపజేసినప్పుడు, నన్ను కూడా అటువంటి నీ విధేయులలో పుణ్య ప్రజలలో చేర్చుము”.

మక్కాలో ప్రవేశించిన తరువాత యాత్రికుడు ఇలా వేడుకోవలెను: “ఓ అల్లాహ్ ! ఇది నీ నగరం మరియు ఇది నీ గృహం; నీ ఆజ్ఞలను శిరసావహిస్తూ, నీ దయాదాక్షిణ్యాలు కోరుకుంటూ నేను ఇక్కడకు చేరుకున్నాను. నా అవసరాలు పూర్తికావటానికి నేను నిన్నే ప్రార్థిస్తాను. నీ శిక్షకు భయపడుతూ నన్ను దయతో స్వీకరించమని, నన్ను క్షమించమని, నాకు స్వర్గంలో స్థానం ప్రసాదించమని వేడుకుంటున్నాను”. ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై దీవెనలు (దరూద్) పంపవలెను.

**అల్ మస్జిద్ అల్ హరమ్ (కాబా మస్జిద్) లోనికి ప్రవేశించటం:**

బాబ్ అస్సలామ్ (శాంతి ద్వారం) నుండి కాబా మస్జిదులోనికి ప్రవేశించటం మంచిది.

యాత్రికుడు కుడికాలు లోపలికి పెట్టి, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై దీవెనలు (దరూద్) పంపి, ఇలా ప్రార్థిస్తూ కాబామస్జిదులోనికి ప్రవేశించవలెను:

“ఓ అల్లాహ్! నా తప్పులను మన్నించు, నా పాపాలను క్షమించు మరియు నీ కారుణ్య ద్వారాలు నా కొరకు తెరువుము ”

“ఓ అల్లాహ్! ఇది నీ పవిత్ర స్థలం మరియు నీ యొక్క ప్రత్యేక సంరక్షణలోని స్థలం. నా మాంసాన్ని, చర్మాన్ని, రక్తాన్ని, మెదడును మరియు ఎముకలను నరకాగ్ని నుండి రక్షించు”.

కాబాగృహాన్ని చూడగానే అతను తహ్లీల్ (లా ఇలాహ ఇల్లల్లాహ్ – ఆరాధ్యుడెవ్వడూ లేడు, ఒక్క అల్లాహ్ తప్ప) ను మరియు తక్బీర్ (అల్లాహు అక్బర్ – అల్లాహ్ యే మహోన్నతుడు) ను ఉచ్చరించవలెను.

తహ్లీల్ మరియు తక్బీర్ ను మూడు సార్లు ఉచ్ఛరించి, చేతులు పైకెత్తి దుఆ చేయవలెను. ఎందుకంటే కాబాను చూస్తూ చేసే దుఆలు ఆలకించబడును:

"ఓ అల్లాహ్ ! నేను చేస్తున్న మంచి ప్రార్థనలన్నింటినీ స్వీకరించుము".


"అప్పుల నుండి, బీదరికం నుండి, జడత్వం నుండి, మనసులోని స్వార్థం నుండి మరియు సమాధి యాతనల నుండి నీ శరణు కోరుకుంటున్నాను".

"ఓ అల్లాహ్ ! నన్ను క్షమించమని, నన్ను కరుణించమని, నా మెడను నరకాగ్ని నుండి కాపాడమని ప్రాధేయపడుతున్నాను".

లేదా యాత్రికుడు తను కోరుకోవాలనుకున్న వాటిని అల్లాహ్ వద్ద మొరపెట్టుకోవచ్చును. ఆ తరువాత ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై దీవెనలు పంపి, ఇలా వేడుకోవలెను: "ఓ అల్లాహ్ ! నీ ఈ పవిత్ర గృహం యొక్క గౌరవాన్ని, స్థాయిని మరియు ఔన్నత్యాన్ని ఇంకా అధికం చేయుము. ఎవరైతే హజ్ కొరకు లేదా ఉమ్రా కొరకు దీనిని సందర్శిస్తారో, వారి గౌరవాన్నీ, ఔన్నత్యాన్ని, స్థాయిని పెంచుము. ఓ అల్లాహ్, నీవే శాంతివి మరియు శాంతి నీ నుండే లభించును. ఓ మా ప్రభూ, మమ్మల్ని శాంతియుతంగా స్వీకరించుము".

## అల్ తవాఫ్ :




- తవాఫ్ ప్రారంభంలో కాబా దిశకు తిరిగి, హజ్రె అస్వద్ (దివ్యశిల) తమ కుడివైపు ఉండేటట్లు నిలుచోవటం మంచిది. ఆ తరువాత హజ్రె అస్వద్ ఎదురుగా ఉండేటట్లు ముందుకు జరిగి, తను చేయదలచిన తవాఫ్ (తవాఫె ఖుదూమ్ లేదా తవాఫె ఉమ్రా చేస్తున్నట్లు) సంకల్పం చేసుకోవలెను.
- హజ్రె అస్వద్ ఉన్న మూల (కార్నర్) నుండి ఇలా పలుకుతూ తవాఫ్ ప్రారంభించవలెను: (బిస్మిల్లాహ్, అల్లాహు అక్బర్) "అల్లాహ్ పేరుతో, అల్లాహ్ యే మహోన్నతుడు."
- వీలయితే యాత్రకుడు హజ్రె అస్వద్ ను స్పర్శించవలెను మరియు ముద్దాడవలెను.
- రద్దీ వలన ఒకవేళ హజ్రె అస్వద్ ను ముద్దాడటం కష్టమైతే, తన కుడిచేతితో దానిని స్పర్శించి, తరువాత ఆ చేతిని ముద్దాడవలెను.

- ఒకవేళ అది కూడా సాధ్యం కాకపోతే, హజ్రె అస్వద్ కు అభిముఖంగా నిలబడి, బిస్మిల్లాహ్ అల్లాహు అక్బర్ అని పలుకుతూ, దాని వైపు ఒకసారి చేయి చూపి, తన తవాఫ్ (ప్రదక్షిణ) ప్రారంభించవలెను.

తవాఫ్ లో ఏడు సార్లు కాబాగృహం చుట్టూ ప్రదక్షిణ చేయవలెను. మొదటి మూడు ప్రదక్షిణలలో పురుషులు తమ కుడి భుజం అందరికీ కనబడేటట్లుగా, దానిపై నుండే ఇహ్రాం బట్టను తొలగించి కట్టుకోవటం (ఇదిబా చేయటం) మరియు రమల్ చేయటం అంటే వడివడిగా నడవటం సున్నత్ అంటే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క విధానము. కుడిభుజాన్ని తవాఫ్ లో మాత్రమే ప్రదర్శించవలెను.

**రమల్ – ఇదిబా :**

**రమల్:** జాగింగ్ చేస్తున్నట్లు వడివడిగా చిన్న చిన్న అడుగులతో ఉరుకులు, పరుగులు లేకుండా కాబా గృహం చుట్టూ ప్రదక్షిణ చేయటం.

**ఇదిబా:** తన ఇహ్రాం పై దుప్పటిని భుజం పైనుండి తొలగించి, కుడి భుజం చంక క్రిందుగా కట్టుకుని, కుడి భుజాన్ని స్పష్టంగా ప్రదర్శించటం. అయితే ఎడమ భుజాన్ని ఇహ్రాం పై దుప్పటితో కప్పి ఉంచవలెను.

రమల్ మరియు ఇదిబాలను తవాఫ్ లో మాత్రమే చేయవలెను. సయీలో చేయనక్కరలేదు. ఇది కేవలం పురుషుల కొరకు మాత్రమే. కాబట్టి తవాఫ్ పూర్తవగానే పురుషులు తమ కుడిభుజాన్ని మరల ఇహ్రాం పైదుప్పటితో కప్పుకోవలెను.

- యాత్రికుడు యమనీ కార్నర్ మరియు హజ్రె అస్వద్ మధ్యలో ఈ దుఆ చదవవలెను: “ రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతవ్, వ ఫిల్ ఆఖిరతి హసనతవ్, వఖినా అదాబున్నార్ - మా ప్రభూ, ఈ ప్రపంచంలో మాకు మంచిని ప్రసాదించు మరియు పరలోకంలోనూ మంచిని ప్రసాదించు మరియు నరకాగ్ని శిక్ష నుండి మమ్ము రక్షించు”.
- యాత్రికుడు మొదటి మూడు ప్రదక్షిణలలో ఇలా ప్రార్థించవచ్చును: “ఓ అల్లాహ్! నా ఈ హజ్ యాత్రను స్వీకరించుము, నా పాపాలను మన్నించుము మరియు నా ఈ కృషిని గుర్తించుము”.
- మిగిలిన నాలుగు ప్రదక్షిణలలో యాత్రికుడు ఇలా ప్రార్థించవచ్చును: “ఓ అల్లాహ్ ! మాకు క్షమాభిక్ష మరియు దయాదాక్షిణ్యాలు ప్రసాదించుము. మమ్మల్ని మన్నించుము, మా పై అనుగ్రహాలు కురిపింపుము, మా గురించి నీకు తెలిసిన వాటిని మన్నింపుము, నీవే అత్యంత సమర్థుడివి, అపార కృపాశీలుడివి”.

యాత్రికుడు ఈ ఇహపరలోకాలలోని శుభాల కొరకు నిరంతరాయంగా ప్రార్థిస్తూ ఉండవలెను..

తవాఫ్ చేసేటప్పుడు ప్రతి ప్రదక్షిణ చివరలో యాత్రికుడు హజ్రె అస్వద్ ను దాటేటప్పుడు, దానిని స్పర్శించటానికి, ముద్దాడటానికి లేదా దూరం నుండే దాని వైపు తన చేతి హస్తాలను చూపటానికి ప్రయత్నించవలెను.

## తవాఫ్ తరువాత చేయవలసిన రెండు రకాతుల నమాజు

తవాఫ్ పూర్తయిన తరువాత, యాత్రికుడు మఖామె ఇబ్రాహీం వెనుక లేదా కొంచెం దూరంగా ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా రద్దీ తక్కువున్న ప్రాంతంలో తవాఫ్ యొక్క రెండు రకాతులు పూర్తి చేయవలెను.

సూరహ్ ఫాతిహా పఠించిన తరువాత - మొదటి రకాతలులో సూరతుల్ కాఫిరూన్ మరియు రెండవ రకాతులో సూరతుల్ ఇఖ్లాస్ పఠించవలెను. ఖుర్ఆన్ (2:125) లో అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించినాడు: (మీరు మఖామె ఇబ్రాహీమును *(ఇబ్రాహీం నిలుచున్న స్థలాన్ని)* నమాజు చేసే స్థలంగా చేసుకోండి).

ఆ తరువాత యాత్రికుడు ఇలా ప్రార్థించవలెను: "ఓ అల్లాహ్ ! నీ దాసులను నీ పవిత్ర గృహం వద్దకు ఆహ్వానించినావు మరియు నేను నీ పిలుపునకు స్పందించి, నీ దయాదాక్షిణ్యాలు, నీ సంతృప్తిని అర్థిస్తూ, నీ శరణు కోరుతూ హాజరయ్యాను. నీవు నాలో నీ తపనను ప్రసాదించినావు, కాబట్టి నన్ను మన్నింపుము. నీవే అన్నింటినీ అధిగమించినవాడవు".

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించినారు: "కాబాగృహం చుట్టూ చేసే తవాఫ్ కూడా నమాజు వంటిదే, అయితే తవాఫ్ లో మాట్లాడటాన్ని అల్లాహ్ అనుమతించినాడు, కాబట్టి తవాఫ్ లో ఎవరైనా మాట్లాడాలంటే, మంచి మాటలనే పలకాలి ". దీని వలననే తవాఫ్ సమయంలో కూడా నమాజులో వలే తహారత్ తో అంటే అపవిత్రత నుండి దూరంగా పరిశుద్ధంగా ఉండవలెను మరియు తమ మర్మాంగాలను కప్పుకుని ఉండవలెను.

ఒకవేళ ఫర్ద్ నమాజు కొరకు లేదా మరల వుదూ చేయటం కొరకు తవాఫ్ ఆపవలసి వస్తే, తను ఆపినచోటునుండే తవాఫ్ కొనసాగించవలెను.

**అల్ ముల్తజమ్ :**

యాత్రికుడు ముల్తజమ్ (హజ్రె అస్వద్ మరియు కాబాగృహ ద్వారాల మధ్యనున్న చోటు) వద్దకు వచ్చినప్పుడు కూడా దుఆలు చేయవచ్చును. ఇక్కడ చేసే దుఆ స్వీకరించబడే అవకాశం ఎక్కువగా ఉంది.

**జమ్ జమ్ జలం:**

యాత్రికుడు తవాఫ్ పూర్తి చేసిన తరువతా తనివితీరా జమ్ జమ్ నీరు త్రాగుతూ, ఇలా వేడుకోవలెను: "ఓ అల్లాహ్ ! నేను ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిన హదీథులో ఇలా విన్నాను: "జమ్ జమ్ జలం – దేనికొరకైతే దానిని సేవించుచున్నారో, అది దాని కొరకే", కాబట్టి నేను "ఓ అల్లాహ్ ! నాకు ప్రయోజనకరమైన జ్ఞానాన్ని ప్రసాదించుము, అపారమైన జీవనోపాధిని ప్రసాదించుము మరియు ప్రతి వ్యాధి నుండి నన్ను నయం చేయుము". అని వేడుకుంటూ దానిని సేవించుచున్నాను."

"ఓ మా ప్రభూ, నరకయాతన మరియు లెక్కలు లేకుండా నన్ను స్వర్గంలోనికి చేర్చుము, మరియు ఉన్నత స్వర్గంలోని నీ ప్రవక్త మరియు మా నాయకుడైన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సహచర్యాన్ని ప్రసాదించుము".

**అస్సఫా మరియు అల్ మర్వాల మధ్య సయీ నడక :**

యాత్రికుడు వీలయితే సఫా ద్వారం నుండి కాబాగృహం కనబడేంత వరకు ఈ క్రింది ఖుర్ఆన్ 2:158 వచనాన్ని పఠిస్తూ అస్సఫా గుట్టపైకి ఎక్కవలెను:

**"నిశ్చయంగా, సఫా మరియు మర్వాలు అల్లాహ్ యొక్క చిహ్నాలలోనివే. ఎవరైతే హజ్ మరియు ఉమ్రా చేస్తారో, వారు ఆ రెండింటి మధ్య తవాఫ్ చేయటంలో (నడవటంలో) ఎలాంటి దోషమూ లేదు. మరియు ఎవరైనా తమకు తాముగా మంచిపనులు చేసినట్లయితే - అల్లాహ్ తప్పకుండా ఆదరించేవాడు, అన్నీ ఎరిగినవాడు"**

ఆ తరువాత "అల్లాహ్ యే మహోన్నతుడు, అల్లాహ్ యే మహోన్నతుడు, అల్లాహ్ యే మహోన్నత్తుడు – సకల ప్రశంసలు ఆయనకే. (మనల్ని సన్మార్గంలో నడపగల మహోన్నతుడు అల్లాహ్ యే. మనపై ప్రసాదిస్తున్న అనుగ్రహాలకు ప్రతిగా సకల ప్రశంసలు ఆయనకే చెందును)" అని పలుకవలెను.


(అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడెవడూ లేడు, ఆయన ఏకైకుడు, ఆయనకు భాగస్వాములెవరూ లేరు. సృష్టిలోని ప్రతిదాని ప్రభువు ఆయనే. సకల ప్రశంసలు ఆయనకే.

ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మరణానికి గురిచేస్తాడు. శుభాలన్నీ ఆయనే కలుగజేస్తాడు. ఆయనే అన్నింటికీ శక్తినిస్తాడు. ఆయన తన వాగ్దానాన్ని పూర్తి చేసినాడు, తన దాసునికి సహాయమందించినాడు, అతని సైన్యానికి బలాన్నిచ్చినాడు మరియు ఒంటరిగా శత్రుసైన్యాలను ఓడించినాడు.

అల్లాహ్ తప్ప ఆరాధ్యుడెవడూ లేడు. పరిపూర్ణ చిత్తశుద్ధితో ఆయనను తప్ప మేము ఇంకెవరినీ ఆరాధించము, సత్యతిరస్కారులకు అస్సలు గిట్టకపోయినా సరే.

ఓ అల్లాహ్ ! "నన్ను వేడుకోండి, నేను ప్రసాదిస్తాను" అని వాగ్దానం చేసియున్నావు మరియు నీవు నీ వాగ్దానాన్ని భంగపరచేవాడివి కావు, కాబట్టి నీవు ఇస్లాం దారి నాకు చూపినట్లుగా, నా మరణం ఆసన్నమయ్యేవరకు నన్ను ఇస్లాం మార్గం నుండి దారితప్పకుండా చేయుము మరియు ఒక నిజమైన ముస్లిముగానే చనిపోయేటట్లు చేయుము.

ఆ తరువాత యాత్రికుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై దీవెనుల పంపి, అస్సఫా గుట్ట దిగుతున్న ప్రతిసారీ, ఇలా వేడుకోవలెను: ఓ అల్లాహ్ ! నీ దయాదాక్షిణ్యాల కొరకు నిన్ను ప్రార్థిస్తున్నాను, నీ క్షమాభిక్షను వేడుకుంటున్నాను. పాపాల నుండి తప్పించుకుంటున్నాను, పుణ్యాలు పొందటానికి ప్రయత్నిస్తున్నాను. కాబట్టి, నన్ను స్వర్గంలో చేరగలిగేవాడిగా చేయుము మరియు నరకాగ్ని నుండి కాపాడుము.




పురుషులు సయీ చేసేటప్పుడు రెండు ఆకుపచ్చ లైట్ల మధ్యన జాగింగ్ లాంటి నడకతో వడివడిగా నడుస్తూ, ఇలా వేడుకోవలెను: "ఓ మా ప్రభూ! ఈ లోకంలోనూ మరియు పరలోకంలోనూ శుభాలను ప్రసాదించుము. నరక యాతనల నుండి మమ్మల్ని రక్షించుము. మా ప్రభూ! మమ్మల్ని మన్నింపుము మరియు మా పై దయాదాక్షిణ్యాలు చూపుము మరియు నీవు అనంత కరుణామయుడివి. మా ప్రభూ! నాకు సన్మార్గాన్ని, భక్తి మార్గాన్ని, శీలవంతమైన మార్గాన్ని మరియు స్వయం సమృద్ధి అయిన మార్గాన్ని చూపమని నిన్ను వేడుకుంటున్నాను. మా ప్రభూ! నిన్ను కొనియాడటంలో, నీకు కృతజ్ఞతలు తెలుపుకోవటంలో మరియు నిన్ను ఆరాధించటంలో నా సహాయం చేయుము.

అల్ మర్వా చేరగానే ఒక నడక పూర్తి చేసినట్లవుతుంది. అలా అస్సఫా నుండి అల్ మర్వా వరకు – ఒక నడక మరియు అల్ మర్వా నుండి అస్సఫా వరకు రెండో నడక – అలా ఏడు సార్లు అస్సఫా మరియు అల్ మర్వాల మధ్య సాగించవలెను. దీనినే సయీ చేయటం

అంటారు. అంటే సయీ అస్సఫా లో ఆరంభమై, అల్ మర్వాలో అంతమవుతుంది. అల్ మర్వా గుట్టపై నిలబడినప్పుడు, యాత్రికుడు, ఖుర్ఆన్ లోని పైన పేర్కొన్న 2:158 వచనాన్ని మరల పఠించవలెను మరియు అస్సఫా గుట్టపై చేసిన దుఆలను మరల చేయవచ్చును. సయీ చేసేటప్పుడు యాత్రికుడు తల్బియా ఉచ్ఛరించవచ్చును. అయితే తమత్తు పద్ధతిలో హజ్ చేసే యాత్రికుడు తల్బియా ఉచ్ఛరించకూడదు.

ఏడవ సయీ నడక పూర్తయిన తరువాత, రెండు రకాతులు నమాజు చేయటం మంచిది.

సయీ నడక సమయంలో యాత్రికుడు ఖుర్ఆన్ పఠనాన్ని చేయవచ్చు మరియు దుఆలు కూడా చేసుకోవచ్చును. అలాగే అల్లాహ్ యొక్క ధ్యానం కూడా చేయవచ్చును.

యాత్రికుడు సయీ నడకను ఇలా వేడుకుంటూ ముగించవలెను: " మా ప్రభూ! దీనిని మా నుండి స్వీకరించుము, మాకు రక్షణ ప్రసాదించుము, మమ్మల్ని మన్నింపుము. నీకు విధేయత చూపటంలో మరియు నిన్ను కొనియాడటంలో మాకు సహాయం చేయుము."

- సయీ నడకలో ఇదిబా చేయటమనేది హనఫీ విధానంలో తప్పనిసరి కాదు కానీ, షాఫయీ విధానంలో అది తప్పనిసరి.
- సయీ నడకకు తహారా (పరిశుద్ధ) స్థితి తప్పనిసరి కాదు, కాని ఈ ప్రాంతం అల్ హరమ్ సరిహద్దులోపలే ఉండటం వలన తహారాతో సయీ చేయటం మంచిది.

| |
|---|
| ఫర్ద్ నమాజు లేదా ఏదైనా కారణం వలన సయీ నడక ఆపవలసి వస్తే, ఆపిన చోటు నుండే యాత్రికుడు మరల సయీ నడక కొనసాగించవలెను. |

**తల వెంట్రుకల ముండనం లేదా చిన్నవిగా కత్తిరించుకోవటం:**

- తలవెంట్రుకలు పూర్తిగా ముండనం చేసుకోవటం లేదా కనీసం వేలిమడత అంత (దాదాపు 2 సెంటీమీటర్లు) కత్తిరించుకోవటం తప్పనిసరి. కానీ బ్లేడు, వస్త్రాతో తలగొరిగించుకోవటం ఉత్తమం. దీని గురించి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పలుకులను ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: "(తల వెంట్రుకలు) గొరిగించుకున్నవారిపై అల్లాహ్ దయ చూపుగాక" సహచరులు ఇలా ప్రశ్నించారు: "తగ్గించుకున్నవారిపై (వెంట్రుకలు కత్తిరించుకున్న వారిపై) ఓ రసూలుల్లాహ్?" ఆయనిలా జవాబిచ్చారు: "(తల వెంట్రుకలు) గొరిగించుకున్నవారిపై అల్లాహ్ దయ చూపుగాక". సహచరులు మరల ఇలా ప్రశ్నించారు: "తగ్గించుకున్నవారిపై (వెంట్రుకలు కత్తిరించుకున్న వారిపై) ఓ

రసూలుల్లాహ్?" ఆయనిలా జవాబిచ్చారు: "(తల వెంట్రుకలు) గొరిగించుకున్నవారిపై **అల్లాహ్ దయ చూపుగాక**" సహచరులు మరల ఇలా ప్రశ్నించారు: "తగ్గించుకున్నవారిపై (వెంట్రుకలు కత్తిరించుకున్న వారిపై) ఓ రసూలుల్లాహ్?" అప్పడు ఆయన ఇలా పలికారు: "మరియు తగ్గించుకున్నవారిపై కూడా". **అయితే స్త్రీలు కొన్ని వెంట్రుకలను తమ వేలిమడత అంత కత్తిరించుకుంటే చాలు. (స్త్రీలు అసలు తలగొరిగించుకోకూడదు).**

ప్రియమైన హజ్ /యాత్రికులారా, తల వెంట్రుకలు గొరిగించుకోవటమనేది అల్లాహ్ తో చేసిన లాభదాయక వ్యాపార క్రిందకు వస్తుంది. ప్రతి ఒక్క వెంట్రుకకు బదులుగా, ఒక పుణ్యం ప్రసాదించపడుతుంది, ఒక పాపం తొలగించబడుతుంది మరియు తమ స్థానం ఉన్నతమవుతుంది.

- తల వెంట్రుకలు గొరిగంచుకునేటప్పడు ఇలా ప్రార్థించవచ్చు: "అల్లాహ్ తనకు చూపిన మార్గదర్శకత్వానికి ప్రతిగా ఆయనను స్తుతిస్తున్నాను. మాపై చూపిన అనుగ్రహాలకు బదులుగా ఆయనను స్తుతిస్తున్నాను. ఓ అల్లాహ్! ఇది నా నుదురు (అంటే నేను పూర్తిగా నీ విధేయుడినే) కాబట్టి నన్ను స్వీకరించు మరియు నా తప్పులను మన్నించు". "ఓ అల్లాహ్! నన్ను క్షమించు మరియు గొరిగించుకునేవారిని మరియు కత్తిరించుకునే వారు. ఓ ప్రభూ, నీవే అపార కృపాశీలుడివి". తల వెంట్రుకలు గొరిగించుకున్న లేక కత్తిరించుకున్న తరువాత యాత్రికుడు ఇలా పలుకవలెను: ఈ ఆరాధనను పూర్తి చేయటంలో మాకు సహాయపడిన అల్లాహ్ కే సకల స్తోత్రములు.

ఇప్పడు హజ్ యాత్రికుడు ఇహ్రాం స్థితి నుండి బయటకు వచ్చినట్లే. ఇంత వరకూ ఇహ్రాం స్థితిలో ఏవైతే నిషిద్ధమైనవో, వాటినన్నింటినీ ఇప్పడు అతను చేయవచ్చును.

# ఉమ్రా సమాప్తం